# ఒక యింద్ర ధనస్సు విరిసే ముందు...

"అయ్యగారి మొగంలో లక్ష్మీకళ వుట్టిపడతా వుంది" అంటూ కీచు గొంతుక వొకటి బిగ్గరగా పలికింది. వులిక్కిపడి తల పైకెత్తి చూశాడు రాజరత్నం. గుమ్మం ముందు వీధిలో నిలబడి వున్నాడో వ్యక్తి. సన్నగా, పొడుగ్గా వున్న శరీరంపైన గంపంత పెద్ద తలపాగాతో బూజుకర్రను తలపిస్తున్న ఆకారం అతడిది. వొంటి పైన వొక దాని పైన వొకటిగా నాలుగైదు రకాల చొక్కాలు తొడుక్కుని, వాటిపైన మసి గుడ్డలాంటి నల్లటి కోటు ధరించి వున్నాడు. మోకాళ్ల వరకూ ధోవతి పోసి కట్టిన పుల్లటి పంచ. చాలని దానికి మరికొన్ని చొక్కాలూ, పంచెలూ, తువ్వాళ్ళూ అతడి భుజాలపైన వేలాడుతున్నాయి. ముఖంలో పెదవుల్ని దాచేసిన గుబురు గడ్డం. పొదల్లా పెరిగిన కనుబొమల పైన గడ్డ కట్టిన రక్తం లాంటి పెద్ద కుంకుమ బొట్టు. తలపాగా పైన తురాయిలా తాయెత్తుల మాల. చెవులకు పేడముద్దల్లాంటి పెద్ద పెద్ద కమ్మలు.

"నీ మొగంలో లక్షిమిదేవి నిలబడిపోయింది. పెద్ద పనిపైన నీకు మనసు మళ్ళింది. యింక నీకు అడ్డమే లేదు" అన్నాడు బుడబుక్కలవాడు డమరుకాన్ని డబడబలాడిస్తూ.

రాజరత్నం ముఖం చిట్లించుకుని విసుగ్గా వీధి చివరి దాకా కలయ జూశాడు. గోవిందయ్యా వస్తున్న జాడేమీ కనిపించడం లేదు. ముఖాన్ని మరింతగా చిటపట లాడిస్తూ బుడబుక్కలవాడికేసి తిరిగి, "పో పో! బిక్షం వేసేందుకు యింట్లో యెవరూ లేరు" అంటూ కసురుకున్నాడతను.

"అయ్యగారు తలపెట్టిన పని సుఖోజయం!" అన్నాడు బుడబుక్కలవాడు.

రాజరత్నం మరోసారి వులిక్కిపడి వీధి చివరి దాకా చూపులు మరల్చాడు.

పెద్ద మలుపు తిరిగి వూళ్ళోకి ప్రవేశించి, వీధిగా సాగారి, పెద్ద మిట్ట మీది నుంచీ కిందికి జారి మాయమైపోయినట్టున్న రహదారి, అనంతం నుంచీ అనంతం వరకూ వ్యాపించినట్టుగా కనిపిస్తోంది. మిట్ట మధ్యాహ్నం యెండలో వీధి యెడారి పాయలా వెలవెలబోతోంది. వీధికి రెండు వైపులా యెలుకల బోనుల్లా నోళ్ళు తెరుచుకుని కనిపిస్తున్న యిళ్ళ వరుసలో మానవులున్న అలికిడేమీ వినిపించడం లేదు. సూర్యుడు నడినెత్తి పైకి రావడంతో గుమ్మం ముందు నిల్చున్న బుడబుక్కలవాడికి నీడ సైతం తోడు రావడం లేదు. గుమ్మం బయట అతనూ, యింటి లోపల తానూ తప్ప, మిగిలిన ప్రపంచమంతా నిర్మానుష్యమైపోయినట్టుగా తోచడంతో రాజరత్నం కంగారు పడిపోసాగాడు.

"నువ్వు నిలబడిన తావులో సుడి తిరిగింది." యెదుటి వ్యక్తి మౌనాన్ని వీలయినంతగా సానుకూల పరుచుకోవడం కోసం బుడబుక్కలవాడు విజృంభించ సాగాడు. "నీ అరిచేతిలో అదురుష్ఠ రేఖ జెర్రిపోతు మాదిరిగా పాకింది. నీ నాలికపైన యినాయకుడు చక్కాముక్కాలేసుకోని కూర్చున్నాడు. నీ నెత్తిపైన ఆదిశేషుడు పడగబట్టి కాపుగాసినాడు. నీ అరికాళ్ళల్లో చక్రాలుండాయి. తిరిగిన చోట తిరగవు. నడిచిన చోట నడవవు..."

వీధి మలుపు కేసి మరోసారి కలయజూశాడు రాజరత్నం. గోవిందయ్య కనిపించలేదు. కోపంగా బుడబుక్కలవాడికేసి వురిమి చూస్తూ, "సరిసర్లే! నా ముందుకొచ్చి నిలబడిన బుడబుక్కలోడే లేడింత వరకూ! యెద్దు మాదిరుండావు. కాళ్ళొంచి పనిచేసే దానికి పాలుమారి తిరిపానికి బయల్దేరినావు, పద పద" అంటూ యీసడించుకున్నాడు.

"అంతా అమ్మ తల్లి ఆన! వూరూరూ తిరిగి పుణ్యం జేసుకున్న మడుసులకు యిలావరిగా సత్తెం జెప్పమని జోగులాంబ తల్లి ఆన పెట్టింది. యీ వూర్లో యెందురో నాకోసరం కాపెట్టుకోనుంటే, నేరుగా నీ యింటికే యెందుకొచ్చినాను? నీకే యెందుకు పలికినాను? అంతా అమ్మ తల్లి దయ. యీ పెద్ద నామాల తిరుదాసు మాటంటే తిరప్తి యెంగటేస్పరుడే యెగిరి పడతాడు. తలకోన సిద్దేశ్వరుడే తలాడిస్తాడు."

రాజరత్నం చూపులు వీధి మలుపు దగ్గర నిలిచిపోయాయి. వీధిలో వొక నరపురుగైనా కనిపించడం లేదు. యీ గోవిందయ్య యెక్కడికెళ్ళాడో?

సమయానికి వస్తాడో, రాడో! అడివంత పెద్ద మామిడి తోట! వద్దంటే విరగ కాస్తుంది. రెండు సంవత్సరాలకు అడమాణం పెట్టుకున్నా లక్షల రూపాయల లాభం వస్తుంది. పోటీదార్లు గుంత నక్కల్లా పొంచి చూస్తున్నారు. యీసారి మరెవరూ దాన్ని తన్నుకు పోగూడదని తన తాపత్రయం. యీ విషయంలో తనకు సహాయం చేయగలిగిన వ్యక్తి గోవిందయ్య వొక్కడేనన్నారు కొందరు. "అయినా, యింత చిన్న పనికి ఆయన దగ్గరికెళ్ళాలా? కావాలంటే యింకా యేదయినా పెద్ద కోరిక కోరుకో! ఆయనగారు తలచుకుంటే చెయ్యలేని పని లేదు" అంటూ వారించారు మరి కొందరు. చాన్నాళ్ళుగా గోవిందయ్య గొప్పతనం గురించి వింటూనే వున్నాడు తాను. అనవసరంగా యితరుల ముందు చేయి చాచడం యిష్టం లేక యింతవరకూ అతడి ముఖమైనా తాను చూడలేదు. తీరా యిప్పుడు తప్పలేదు. అడ్వాన్సుగా డబ్బు కూడా పంపించాడు తాను. 'గోవిందయ్యకు కమీషనివ్వబోయావా? యెంత అపరాధం' అంటూ కొందరు గోల చేశారు. యెంత పెద్ద గుమ్మడికాయ అయినా జానెడు కత్తిపీటకు లోకువన్న సంగతి వాళ్ళకేం తెలుసు! గోవిందయ్య కమీషన్ తీసుకున్నాడనీ, తప్పకుండా సమయానికి వచ్చి సహాయం చేస్తాడనీ, మధ్యవర్తి వర్తమానం పంపాడు. అయినా, యిప్పుడు సందేహం వస్తోంది. గోవిందయ్య కమీషన్ తీసుకోవడానికి నిరాకరించాడేమో! మధ్యవర్తి అబద్ధం చెప్పి తనను మోసం చేస్తున్నాడేమో! యింతకూ యీ గోవిందయ్య యెలాంటి వ్యక్తి? యెలా వుంటాడు? సమయానికి ఆదుకుంటాడా లేదా? తనకు యీ వ్యాపారమే గాకుండా యింకా చాలా లావాదేవీలున్నాయి. అవతల కొంపలు ముంచుకు పోయే పనులు యెదురుచూస్తున్నాయి. తాను యిల్లు వదలిపెట్టి బయటికెళ్తే, యీలోగా గోవిందయ్య వచ్చి, తాను లేకపోవడం సాకుగా చేసుకుని, తిరిగెళ్ళిపోతాడేమోనని కంగారుగా వుంది. వుదయం నుంచీ కాలు గాలిన పిల్లిలా యింట్లో తచ్చాడుతూనే వున్నాడు తాను.

"యెనకమాల నుంచీ యెగజూసుకోనుండావు. నీ కోరిక తీరితిందిలే! అంబ మాటకు తిరుగు లేదు" అన్నాడు దాసు రాజరత్నం కళ్ళల్లోకి సూటిగా చూస్తూ.

రాజరత్నంలో కొద్దిగా వుత్సాహం తొంగి చూసింది. గోవిందయ్య వస్తూనే వుంటాడు. యేదో తోయరాని పనిలో తగులుకొని ఆలస్యమై వుంటుంది అంతే!

"నువ్వెదురు చూసే పని పండవతాది. అయితే దేవరకు కొంచెం శాంతి జెయ్యాల..." అంటూ దాసు తన వుచ్చు బిగించబోయాడు.

"యెవురైనా, యెప్పుడైనా, యేదో వొక దాని కోసరం యెదురుచూస్తానే వుంటారు. ఆ మాట జెప్పేదానికి దేవతలు దిగి రావాల్నా? నీ మాటల యాపారానికి యిక్కడెవురూ మోసపోరు. అనవసరంగా నీటయిం నా దగ్గిర వృథా జేసుకోవద్దు. యీ గడపలో నీకు రెండు దమ్మిడీలు గూడా రాలవు" అన్నాడు రాజరత్నం వీలయినంత వరకూ అతడి మాటల పట్ల తనకు ఆసక్తి లేనట్టుగా నటిస్తూ.

దాసు చేతిలోని గొడుగునూ, భుజంపైని బరువునూ వీధి దిన్నె పైన పెట్టేశాడు. గడపకవతల యెండలోనే పద్మాసనమేసుకుని కూర్చునేశాడు. "అంబ పలుకును ధిక్కారం జెయ్యొద్దు. చెడిపోతావు. అంతా యిశిదంగా పలకతాను విను" అంటూ తాపీగా రాగ యుక్తంగా చెప్పుకుపోసాగాడు. "నీది చేతి కష్టం బతుకు. నీ చెమటే నీకు దిక్కు. అబ్బా అమ్మా యిచ్చిపోయిందేమీ లేదు. అత్తగారు నీ దగ్గిరే తినిపోతారు. తోడబుట్టినోళ్ళు దాయాదులు. బావ మరుదులు బతకజూడరు. అయినా, యిడుములేవులే నీకు! నువ్వు పట్టింది బంగారం. తాకింది వెండి. అనుకునింది అమృతం. తాగిందంతా పాయసం..."

విన్నంతసేపూ విని, "ఆ గోషంతా ఆ పక్కింటాయినకు గూడా జెప్పు. సరిగ్గా సరిపోతింది" అన్నాడు రాజరత్నం.

దాసు కాసేపు మౌనంగా వుండిపోయాడు. తరువాత, "నీకు అంబ పైన అగుమానం వచ్చింది. అయితే, కాసుకో. యింకా యిశిదంగా చెబ్తాను. అబద్ధం పలికితే అప్పుడు చెప్పు. యీ డప్పు పగలగొట్టేసి, యిట్లే యెలబారిపోతాను. నిజమయితే మాత్రం అంబ అడిగినదంతా యియ్యాల. యియ్యకుంటే లక్షిమిదేవికి వుగ్రమొస్తింది. నీ పక్కకు మొగం తిప్పదు" అంటూ రాదీశాడు.

"నీ బెదిరింపులు నా దగ్గర చెల్లవు. నా రెక్కల కష్టం పైన్నే నాకు నమ్మకం" అన్నాడు రాజరత్నం తన మాటల్లోని పట్టుదలను తన ముఖంలో గూడా ప్రతిఫలించడానికి విఫల ప్రయత్నం చేస్తూ.

"మానవ ప్రయత్నానికి దైవ యత్నం జత గూడాల. కావాలంటే యింకా చెప్తాను యినుకో" అంటూ దాసు గుడ్లురిమి చూశాడు. "నికార్సుగా వచ్చే రూకల్ని యెడం చేత్తో యిదిలించేసినావు. రూకలతో వుప్పర పట్టె ఆడతా వుండావు. అంతేగాదు, వొక రూకను నేలలో నాటినావు. రెండు చెట్లు మొలిచినాయి. వొక చెట్టు యెండిపోయింది. యింగో చెట్టుకు యిబ్బడి ముబ్బడిగా కాయలు గాసినాయి. ఆ పండ్లు దిని, ఆ యిత్తనాలు యింకో నేలలో

గుచ్చిపెడితివి. అక్కడ రెండు చెట్లు పుట్టినాయి. వొకటి పురిట్లోనే సంది గొట్టుకోని పోయింది. యింగొకటేమో యిస్తారంగా కొమ్మల్ని దింపింది. రెండు కొమ్మలకు వూడలు గూడా దిగినాయి. వొక కొమ్మలో పెద్ద పండు కాసింది. పెద్ద చిలకొకటి ఆ పండు దిని, దాని యిత్తనాల్ని దూరానికి యిసిరేసింది. అక్కడ గూడా పెద్ద చెట్టు మొలిచింది. ఆ చెట్టు తొర్రలో అంబ నిలిచింది. అయినా, నువ్వింకా మనుషుల్నే నమ్ముకున్నావు. అమ్మ తల్లికి అగుమానం జేసినావు..."

రాజరత్నం మళ్ళీ కళవరపడ్డాడు. వీధంతా యెండకు పట్టిన అద్దంలా మినమనా మెరుస్తోంది. యీ గోవిందయ్య రాకుండా పోతాడా? లేకపోతే తన పోటీదార్లతో జత కలిశాడా? తనను మోసం చేస్తున్నాడా?

"యెందుకు రాడు? రాకపోతే నేనిచ్చిన కమీషన్నంతా కక్కించేస్తాను" అంటూ స్వగతంగా అనుకోబోయి బయటికే అనేశాడు రాజరత్నం. మాటలు వెలువడిన తరువాత దొంగతనం చేస్తూ పట్టుపడిపోయిన దొంగలా కంగారు పడిపోసాగాడు.

ఆ మాత్రం వివరం చేతికి దొరకడంతో దాసు మరికాస్త వుత్సాహంతో తన పాటను నిగుడించాడు. "నీ భార్యకు నువ్వంటే దడ. నీ బిడ్డలకు నువ్వంటే జీర. నీ దుడ్డు తిన్నోళ్ళే నిన్ను బరిలోకి లాగినారు. వొంటి చేత్తో బండిని లాగతా వుండావు. నీ మెడపైన కాడి దిట్టంగా దిగబడిపోయింది. నువ్వేగట్టుకు చేరతావో నీకు తెలియదు..."

"అప్పటికి నీకు తెలుసునా నువ్వే గట్టుకు చేరబోతావుండావో" అంటూ దాసుకేసి సవాలు విసిరాడు రాజరత్నం.

"అంబ దయ నాపైనుండాది. నాకు అంబపైన గురుండాది" అంటూ దాసు తప్పించుకోవడానికి ప్రయత్నించాడు.

ముఖం చిట్లించుకుంటూ అతడి వైపుకు చూసి, "నీకు పెండ్లయిందా? బిడ్డలెందరు" అని అడిగాడు రాజరత్నం.

"నాది నాదంటావు, యేది నీదయ్యేను మనసా! బిడ్డలూ పెండ్లమూ నీతోటి రాబోరు మనసా" అంటూ దాసు తత్వాన్ని మొదలు పెట్టేశాడు.

"బిడ్డల్లేరు. పెండ్లామూ లేదు. యింక నీకన్ని గుడ్డలెందుకు? మోత కష్టం గాకపోతే ఆ వేషమెందుకు? యెందుకంత పనికిరాని ఆశ?" అన్నాడు రాజరత్నం వెక్కసంగా.

"భక్తులు అంబతల్లికి యిచ్చిన వస్త్రాలు. కాదన గూడదు. అంబకు కోపం

రానియ్యగూడదు" అన్నాడు దాసు.

"నీ జోలె కుంభం మాదిరుంది. ఆ అన్నం పదిమందికైనా సరిపోతుంది. రాత్రయితే పాసిపోతుంది. అంత అన్నం నీ వొక్కడికెందుకు? అంత అన్నమూ, అన్ని గుడ్డలూ పెట్టుకోని, యింకా బిక్షమెత్తుకోడం యెందుకు? అనవసరంగా మోసి చచ్చేదెందుకు?" అంటూ రాజరత్నం దాసు పైన విరుచుక పడ్డాడు.

"అపరాధం, అపరాధం" అంటూ లెంపలేసుకున్నాడు దాసు. ఆ తరువాత, "యింత సంపాదన పెట్టుకోని యింకా దేనికోసరమో యెగజూసుకోనుండావు. తాపత్రయం తగ్గలేదు. యింకా సంపాయించి యేం జేసుకుంటావు?" అని ప్రశ్నించాడు.

"నా సంపాదనతో నీకేం పని?" అన్నాడు రాజరత్నం చీకాకుగా.

"సంపాయించి యేం జేసుకుంటావు?" అని మళ్ళీ అడిగాడు దాసు.

"దాచి పెట్టుకుంటాను" అన్నాడు రాజరత్నం కచ్చగా.

"దేని కోసం దాస్తావు" అని అడిగాడు దాసు.

రాజరత్నానికేమని సమాధానం చెప్పాలో తోచలేదు.

"దానం చెయ్యి. పుణ్యం వస్తింది. నీ యెనకమ్మంటే ఆ లోకానికొచ్చేది అదొగిటే" అన్నాడు దాసు.

"ధర్మాలూ, గిర్మాలూ నా దగ్గర చెల్లవు. పోతావా లేకపోతే దుడ్డుకఱ్ఱ తెమ్మంటావా?" అంటూ గీపెట్టాడు రాజరత్నం.

"అంబ దగ్గిర సత్తెం పలికించుకోని వూరికే పొమ్మంటే పాపం. దక్షిణ లేకపోతే అమ్మతల్లికి వుగ్రమొస్తింది. వురిమి చూసిందంటే మసిబొగ్గయి పోతావు. పాత వస్త్రమో, యింత కవళమో యిస్తేగానీ నేను కదలగూడదు" అంటూ మరింత దిట్టంగా కూచునేశాడు దాసు.

"అందుకే మీరంటే వొళ్లుమంట నాకు. పోతే పోనీలే అనుకుంటే నెత్తిపైకెక్కేస్తారు. దేవుడి పేరూ దెయ్యం పేరూ చెప్పి దండుకోవాలనుకుంటారు. నీ బుడ్డ బెదిరింపులు నా దగ్గిర జరగవు. కాళ్ళూ చేతులూ లేని అవిటోళ్లకు దానాధర్మం జేసేది న్యాయం. కోస్తే పదూర్లకు సరిపోతావు. నీకెందుకు ధర్మం? పోతావా, రెండు తన్నమంటావా" అని అరిచాడు రాజరత్నం, చేతికందిన దుడ్డుకఱ్ఱను గాలిలో జళిపిస్తూ.

"పలుకు పలికినాక దక్షిణ దీసుకోకుండా కదిలితే అంబకు నాపైన కోపం వస్తింది. ఆ కట్టు దాటే దానికి నాకు వశం లేదు. యీ పొద్దు నీ చేతుల్లో దెబ్బలు

తినాలని రాసిపెట్టుంటే తప్పించుకునే దానికి నాకు వశమా? నువ్వియ్యాల, నేను గిరి దాటాల" అనేశాడు దాసు.

రాజరత్నం నీరసంగా వీధి మలుపుకేసి చూశాడు. గోవిందయ్య రావడం లేదు. 'అసలు వస్తాడో రాడో! యీ బుడబుక్కల వాడి బుట్టలో పడ్డానికి అతనే గదా కారణం! రానీ, యీ రోజు అతగాడి దుమ్ము దులిపేస్తాను' అనుకున్నాడు రాజరత్నం. గోవిందయ్య పైనున్న కోపాన్నంతా దాసు వైపుకు మళ్ళించడానికి ప్రయత్నిస్తూ "నువ్వు పలికిందేం సత్యం? ఆ మాటలు యీ లోకంలో యెవురికైనా చెల్లుబాటైపోతాయి. దానికి దక్షిణ గూడానా? పో పో" అన్నాడు.

దాసు అయిదు నిమిషాల సేపు రాతిబొమ్మలా కూర్చుండిపోయాడు. ఆ తరువాత, "నేను పుట్టి బుద్దెరిగినాక యీ మాదిరిగా నా పైన నిందెయ్యలే దెవురూ! సరే, యింకోసారి పలకతాను. యినుకో" అంటూ గొంతు సవరించుకోబోయాడు.

"నీ పలుకూ వద్దు, నువ్వూ వద్దు. పో పో" అన్నాడు రాజరత్నం దుడ్డుకర్రను గడపకేసి విసరుతూ.

"పలికిన పలుకుకు దక్షిణ లేకుండా యీ గడప కదలను. కావాలంటే అంబ పేరు చెప్పుకొని యిక్కణ్ణే పాణాచారం జేసేస్తాను" అన్నాడు దాసు.

"దక్షిణ పేరుతో నా దగ్గిర నుంచీ పైసా గూడా రాలదు నీకు! కావాలంటే కూలీగా చెప్పు యిస్తాను. కానీ, దానికేదైనా పని జెయ్యాల గదా నువ్వు" అన్నాడు రాజరత్నం.

"నీ దగ్గిర్నించీ రెండు రూకలు నా దోసిట్లో పడాల. అది దక్షిణో, కూలో నాకనావస్యం. కావాలంటే కూలీకి పనేందో చెప్పు. చేసేసి రూకలు దీసకపోతాను" అన్నాడు దాసు కాసేపు ఆలోచించాక.

అనుకోని ప్రశ్న యెదురవడంతో రాజరత్నం బెంబేలు పడిపోయాడు. కాసేపు చుట్టూ కలయజూశాడు. వీధిలో దిన్నె పక్కన పెద్ద చింతమొద్దు కనిపించింది. యింట్లోకి వెళ్లి గొడ్డలి తీసుకొచ్చి దాసు ముందు పడేస్తూ, "దాన్నీ పొయ్యిలోకి చీల్చు. కూలీగా పది రూపాయలిస్తాను" అన్నాడు.

"నీ దగ్గిర్నించీ దక్షిణ దీసుకోకపోతే అంబ కట్టు దాటినోన్నవుతాను. అంబ కోసరం కూలీ జేసేదానికి గూడా పాలుమారను. అంబ పలుకు పైన అగుమానం వస్తే అపరాధం. నీ దగ్గిర చిల్లర దీసుకున్నాక మళ్ళా పలుకు పలకతాను. దానికేమీ దక్షిణ వొద్దులే! రెండింటికీ అదే దక్షిణనుకుంటాను. కానీ, నువ్వు

భక్తితో యినుకోవాల, సరేనా?" అని అడిగాడు దాసు.

"తొందరగా కానీ. యీలోగా గోవిందయ్య వస్తే మాత్రం నేను వెళ్ళిపోతాను" అన్నాడు రాజరత్నం.

వొంటి పైనున్న వస్త్రాల్నీ, తలగుడ్డనూ విప్పిదిన్నెపైన పెట్టేశాక, గొడ్డలి చేత బట్టుకుని చింత మొద్దు పైన కలబడ్డాడు దాసు.

పాతకుర్చీని గుమ్మం దగ్గరికి లాక్కుని, వీధికేసి తిరిగి చూస్తూ కూర్చున్నాడు రాజరత్నం.

చింతమొద్దు పైన గొడ్డలితో రెండు మూడు సార్లు బాదేసరికి దాసుకు వొళ్ళంతా చెమటలు పట్టేశాయి. పెద్దగా గసలు బోస్తూ అతడు పనిచేసుకుపోసాగాడు. అతడి అసురుసులు చూసి, చిరునవ్వు నవ్వుకుంటూ పక్కకు తిరిగిన రాజరత్నం ధిగ్గున కలవరపడ్డాడు. యెదురుగా గోడపైన అద్దంలో నేరుగా తనకేసే చూస్తున్న ప్రతిబింబంలో సైతం అదే కలవరపాటు ప్రతిఫలించింది. ముఖం చిట్లించుకుంటూ మరింతగా పరీక్షించి చూశాడు రాజరత్నం.

నూనెను మరిచిపోయిన జుట్టు యెండిపోయిన తాటి ముట్టెలా చీకిరి బాకిరిగా తయారై వుంది. నొక్కులు పడ్డ ముఖంపైన ముళ్ళ పొదలా అస్తవ్యస్తంగా గడ్డం పెరిగుంది. కనురెప్పల కింద లోతైన గుంటల్లా కనిపిస్తున్నాయి కళ్ళు. వేసుకున్న పాత చొక్కాకు రెండు మూడు చిరుగులు గూడా కనిపిస్తున్నాయి.

చాలాసేపటి తర్వాత గానీ ఆ ప్రతిబింబం తనదేనన్న విషయం అతడికి స్ఫురించలేదు. యింతలో తాను అద్దంలో చూసుకుని చాలా రోజులైపోయిందన్న విషయం జ్ఞాపకం వచ్చిందతడికి. 'అయినా, అద్దం ముందు తీరికగా కూర్చుని సుద్దులు చూసుకునేటంత తీరిక తనకెక్కడుంది' అనుకున్నాడతను. యీలోగా అతడి దృష్టి అద్దం పక్కనే వున్న ఫోటో పైకి పాకింది. బాగా వెలిసిపోయిన ఆ పాత ఫోటోలో సైతం వుంగరాల జుట్టుతో, వయ్యారాల మీసకట్టుతో, మిలమిల మెరుస్తున్న చిరునవ్వుతో వెలిగిపోతున్నాడో వ్యక్తి. మరి కాస్సేపటి తర్వాతగానీ ఆ ఫోటో తనదేనన్న సంగతి రాజరత్నానికి స్ఫురించలేదు. అప్పుడు తన జీతం రెండు మూడు వందలకు మించేది గాదు. కానీ, యెప్పుడూ మడతలు నలగని బట్టలతో, తళతళ మెరిసే బూట్లతో సెట్‌పైకి వెళ్ళే సినిమా హీరోలా ఆఫీసుకెళ్లేవాడు. అప్పుడు తానో చిన్న

పెంకుటింట్లో అద్దెకుండేవాడు. కానీ, యీ యింటిలా కాకుండా యెక్కడి వస్తువులక్కడ దిద్ది పెట్టినట్టుండేది. యింటి ముందు తన కోసం యెదురుచూసే సైకిలుసైతం యెప్పుడూ కొత్తగా మిలమిలలాడేది. రోజూ పొద్దున నూనె గుడ్డతో దాన్ని తుడవడానికో గంట సమయం పట్టేది. అప్పుడు తాను వట్టి కుండ. యింట్లో వస్తువులే లేనప్పుడు సర్దుకోవడానికేం కష్టం?" అనుకున్నాడు రాజరత్నం. అలాంటి అనవసరమైన విషయాల్ని పట్టించుకోకపోవడం వల్ల పొరపాటేమీ జరగలేదనుకున్నాడతను. యిప్పుడు కూడా యీ మేడ వెనక అతడి కోసం పెద్ద మోటారు వాహన మొకటి వేచి వుంది. కానీ , అది బురదగొట్టుకుపోయి వెలవెల బోతోంది. 'వ్యాపారం పనుల పైన పల్లెలకంతా మట్టి బాటలపైన తిరిగే బండి: శుభ్రంగా వుండాలంటే యెలా కుదురుతుంది?' అనుకున్నాడతను. 'నేను దానికి యజమానిని గానీ, అది నాకు యజమాని గాదు. పని చేసినంత కాలమే దానికి నా దగ్గర చోటని దానికీ తెలుసు' అనుకుంటూ నవ్వుకున్నాడతను.

"వొక చెంబు నీళ్ళియ్యి సామీ! దాహంగా వుండాది."

వొళ్లంతా చెమటలు ధారలు గట్టుతుండగా దాసు ఆకారం రాజరత్నం ముందుకొచ్చి నిల్చుంది.

అతను యింటి లోపలికెళ్ళి నీళ్ళు తీసుకొచ్చి యిచ్చాడు.

చెంబెడు నీళ్ళుఖాళీ జేసేశాక, "అమ్మగారు యింట్లో లేరా సామీ" అని ప్రశ్నించాడు దాసు యింట్లోకి పరకాయించి చూస్తూ.'యీ భిక్షగాడికి తన యింటి సమాచారంతో పనేమిటి?' అనుకుంటూ విసుక్కున్నాడు రాజరత్నం.

"యింత యింట్లో వొంటి బిత్తిరి బతుకు బతకతా వుండావు. పాపం!" అన్నాడు దాసు పెదవులు చప్పరిస్తూ.

రాజరత్నానికి చెప్పలేనంత కోపం వచ్చింది. "నా కూతురికి ప్రసవమయిందని నా పెండ్లాం చూసే దానికి పోయింది. రేపో, మొర్నాడో వచ్చేస్తింది. నా కొడుకు టౌన్లో సొంత వ్యాపారం చేస్తా వుండాడు. నన్ను జూసి నువ్వేమీ కనికరించాల్సిన పనిలేదు. ముందు చెప్పిన పని త్వరగా ముగించు" అంటూ కసురుకున్నాడు.

దాసు చేతి గొడ్డలి చింత మొద్దుతో మళ్లీ కసరత్తు మొదలెట్టింది. వీధి మలుపుకేసి చూశాక, రాజరత్నం పెద్దగా నిట్టూరుస్తూ, "గోవిందయ్య చచ్చాడో, బతికాడో" అని గొణుక్కున్నాడు. అతగాడి కోసం తాను పడిగాపులు

పడుతున్నట్టు తోచడంతో రాజరత్నంలో క్రమంగా చీకాకు పెరిగిపోసాగింది. 'యెందుకొచ్చిన వ్యాపారం? వుద్యోగం చేస్తున్నప్పుడే హాయిగా వుండేది. వద్దన్నా వినిపించుకోకుండా వుద్యోగం విడిచిపెట్టి యీ రొంపిలో కూరుకు పోయినారు. యిప్పుడు క్షణం తీరికుందా మీకు? యింట్లో రెండు కాళ్లూ దగ్గర పెట్టుకుని కూచుంటున్నారా మీరు! పెళ్ళాం బిడ్డలతో రోజుకొకసారైనా మాట్లాడే తీరికుందా యెప్పుడైనా?' అంటూ తన భార్య గొణగడం జ్ఞాపకం వచ్చిందతడికి. 'ఆ సంపాదనే లేకుంటే యీయిల్లెలా వచ్చింది? ఆవిడగారి వొంటిపైన నగలెలా వచ్చాయి? అమెగారి సంతానానికి మహరాజ దర్బారెలా కుదిరింది?' యిలా తాను సంధించే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక తెల్లబోయే ఆమె ముఖం గూడా గుర్తుకొచ్చింది. అతడి పెదవుల పైకో చిరునవ్వు వచ్చింది.

దాసు గొడ్డలి దెబ్బలకు చింతమొద్దు చిన్న చిన్న భాగాలుగా విడిపోవడం చూస్తున్నకొద్దీ ఆ నవ్వు మరింత పెద్దగా సాగింది. "చింతపేళ్లన్నీ తెచ్చి యిక్కడ పెట్టు" అంటూ మరో ఆజ్ఞను జారీ చేశాడు రాజరత్నం.

చింత చెక్కలన్నీ తెచ్చి గోడ పక్కన కుప్పగా పేర్చి పెట్టేశాడు దాసు. యెండ కొంచెం పడమరకు మళ్ళడంతో ద్వారం దగ్గర, దిన్నె పక్కన మూరెడు నీడ యేర్పడింది. నీడలోకొచ్చి కూర్చున్నాక, "స్వామీ, యింకో చెంబు నీళ్ళు" అన్నాడు దాసు.

రాజరత్నం నీళ్ళు తీసుకొచ్చేసరికి దాసు అన్నంతో కలబడుతూ కనిపించాడు. కుర్చీలోకూర్చుని అతడి వైపు వింతగా చూడసాగాడు రాజరత్నం. గంగాళమంత పెద్దగావున్న జోలెలోంచీ పెద్దపెద్ద అన్నం ముద్దలు చేసుకుని గబగబా మింగుతున్నాడు దాసు. పట్టెడు అన్నం తిన్నాక చేతులు కడుక్కుని మిగిలిని నీళ్లన్నీ తాగేశాడు.

జోలెను మళ్ళీ సర్దిపెట్టుకున్నాడు దాసు. భుక్తాయాసంతో గోడకు చేరగిలబడి కళ్ళు మూసుకున్నాడు. ఆ తరువాత అరమోడ్పు కన్నుల్ని రాజరత్నం వైపునకు తిప్పి, "యీ మధ్యలో చాన్నాళ్లుగా సరిగ్గా ఆకిలెయ్యటం లేదు. వొళ్ళలిసే సరికి కడుపులో పేగులు కదిలినాయి. రెండు వారాలయింది యీ మాత్రం రెండు ముద్దలు తిని" అంటూ తృప్తిగా నవ్వాడు.

"చెమట పట్టకుండా బద్దకంగా బతికితే వొళ్ళుమాటింటిందా? కష్టపడితేనే మనిషి మిషను సరిగ్గా పని చేసేది. లేకపోతే తుప్పుపట్టిపోతుంది" అన్నాడు రాజరత్నం పెద్దగా నవ్వేస్తూ.

"యిప్పుడు సరిగ్గా యిను. నువ్వేదురు చూసే పని కాయయ్యేదీ, పండయ్యేదీ కచ్చితంగా పలకతాను. మనసు యాణ్ణో బెట్టుకోని యిన్నావంటే సత్తెం చెయ్యి జారిపోతింది. నా మాట పైన్నే గురి బెట్టు" అంటూ మొదలెట్టాడు దాసు తాంబూలంతో పండిన నోటిని కాకి ముక్కులా పెద్దగా తెరుస్తూ.

రాజరత్నం వోసారి వీధిమలుపుకేసి పరకాయించి చూసి, ఆ తరువాత దాసు కేసి తిరిగాడు.

"అంబ పలుకు... జగదంబ పలుకు... కంచి కామాక్షి పలుకు... తిరపతి యెంగటేస్పరుడు పలుకు... కంచికామాక్షి పలుకు..." అంటూ దాసు రాగం మొదలు పెట్టాడు. "యివరంగా యినుకో... నీ యబ్బ కరుణాత్ముడు. నీ అమ్మ గంగమ్మ. నీ నట్టిల్లు బంగారం..." అని కూని రాగం తీస్తూ తీస్తూ దాసు కాసేపు ఆగిపోయాడు.

గోవిందయ్య రాక గురించిన సూచన కోసం వెతుకుతూ రాజరత్నం, దాసు పాటపైన్నే దృష్టిని కేంద్రీకరించసాగాడు.

యీలోగా దాసు పెదవుల పైన చిన్న చిరునవ్వు మొలిచింది. అతడి గుండెల్లోంచీ పొంగుకొచ్చినట్టుగా కొత్త రాగమొకటి బయటికొచ్చింది. పిడికెడు అన్నం, జానెడు నీడ అతడిలో రేకెత్తించిన సంతోషం కేసి రాజరత్నం విస్మయంగా చూడసాగాడు. దాసు అసంకల్పితంగా పాడసాగాడు.

"దక్షిణాపు కొండాన దంతెల్లు నరికీ
తూరుపు కొండాన దూలాలు నరికీ
పడమట కొండాన పసరికలు కోసీ
వచ్చెనే నెలరాజు వాళ్ల నగరీకీ
వాడు వచ్చేటి దోవలో అల్ల నేరేడు మాను
అల్ల నేరేడు కింద నల్లన్ని సెలమ
నల్లన్ని సెలమలో తెల్లన్ని కలవ
తెల్లన్ని కలవపై గండు తుమ్మీగ..."

వాన వెలిసిన తరువాత కొండ వాలులోంచి వీచే చల్లని గాలిలా, దాసు పాట యథేచ్ఛగా వ్యాపించ సాగింది.

క్రమంగా రాగంలోని హాయికి లొంగిపోయిన రాజరత్నం, పాటలోని మాటలను పట్టించుకోవడం మానేశాడు.

చిత్రంగా అతడికి చిన్నతనంలో వాళ్ళమ్మ గోరు ముద్దలు తినిపించడం

జ్ఞాపకం వచ్చింది.

పెళ్ళయిన కొత్తలో వాళ్ళావిడ తలలో ముడుచుకునే మల్లెపూల వాసన, ఘాటుగా ముక్కుపుటాలకు సోకినట్టుగా తోచింది.

వుద్యోగం చేస్తున్న రోజుల్లో తాను గొప్ప సంపదలా చూసుకుని మురిసిపోయిన పాత రిస్ట్‌వాచీ గుర్తుకొచ్చింది.

తన భుజాల పైకెక్కి ఆడుకున్న తన పిల్లల ముదిగారం జ్ఞాపకం వచ్చింది.

కొండపేటులో పుట్టి, రాళ్ళపైన తప్పటడుగులు సాగించి, చెట్ల గుబురుల మధ్య బుడిబుడి నడకలు నేర్చుకుని, మైదానాల్లో పరుగెత్తడం మొదలు పెట్టే సెలయేరులా దాసు పాట రాజరత్నాన్ని అతడి జీవితపు చిత్తడి స్థావరాలకంతా మోసుకెళ్ళింది. పీఠభూమిపైన్నుంచీ జలపాతంలా లోతైన లోయలోకి దుముకుతూ, అతణ్ణి అంతర్మధ్యంలో ఆపేసి అంతలో ఆగిపోయింది.

వులిక్కిపడ్డాడు రాజరత్నం.

కాస్సేపటి తర్వాత తేరుకుని కళ్ళు తెరచి చూశాడు. అప్పటికి వాతావరణంలో సైతం పెద్ద మార్పు రావడం గమనించి అతను మరింతగా కలవరపడిపోయాడు.

అంతవరకూ పెళపెళ గాసిన సూర్యుణ్ణి నల్లటి మబ్బొకటి కమ్మేసింది. పటపటా పెద్ద పెద్ద చినుకులు రాలుతున్నాయి. వీధి మలుపు దగ్గర అంతర్ధానమైపోతున్న దాసు ఆకారం పైన ఆకాశంలో పెద్ద యింద్రధనుస్సు గూడా పురి విప్పింది.

ముందుగా దాసు తన దగ్గరి నుంచీ పాత వస్త్రాలూ, దక్షిణా తీసుకెళ్ళడం మరచిపోయాడన్న విషయం గుర్తుకొచ్చి రాజరత్నం ఆశ్చర్య పడిపోయాడు.

చాలా సేపటి తర్వాత, తాను గోవిందయ్య కోసం యెదురు చూడ్డం చాలాసేపటి వరకూ మరచిపోయానన్న సంగతి జ్ఞాపకం రావడంతో, అతను మరింతగా విస్తుపోయాడు.

*(19 జూన్ 2001, యిండియాటుడే)*

❖ ❖ ❖